గర్భిణికి తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి–చింతపల్లి: మండలంలోని బలపం పంచాయతీ పరిధిలోని కుడుముల సుత్తిపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నిండు గర్భిణీ స్త్రీని గ్రామస్థులు డోలిమోతపై కోరుకొండ హాస్పిటల్‌కు తరలించారు. సుమారు 8 కిలోమీటర్ల దూరం రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సక్రమంగా .తమ గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు జిల్లా స్థాయి అధికారులకు విజ్ఞప్తి చేశామానీ, ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు.

డోలీలో తరలిస్తున్న కుటుంబీకులు

విద్యుత్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ..

స్మార్ట్‌మీటర్లపై ఉధృత ఉద్యమం

-సిపిఎం ఆధ్వర్యాన బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి

అరకులోయలో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నేతలు

చింతపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యుత్ పోరాటాల్లో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి,రామకృష్ణ, బాలస్వామి ఆశయాలను వృథా కానివ్వమని వారి ఆశయాలు కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ అప్పటి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం హయంలో ఆందోళన చేస్తున్న తరుణంలో పోలీసుల కాల్పుల్లో విష్ణువర్ధన్ రెడ్డి,రామకృష్ణ, బాలస్వామి మరణించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదే బాటలో విద్యుత్ ప్రైవేట్ వ్యక్తులైన అదానికి అప్పచెప్పలని ప్రయత్నం చేస్తుంద న్నారు. ఇందులో భాగంగానే స్మార్ట్ మీటర్లు ప్రతి ఒక్కరు బిగించాలని ప్రజలపై ఒత్తిడి తెస్తూ వివిధ చార్జీల పేరుతో సామాన్యులకు వేలాది రూపాయలు బిల్లులు వేస్తున్నారన్నారు. విద్యుత్ పోరాటాల్లో అమరులైన వీరుల ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు కొర్రా మగ్గన్న, నాయకులు కిల్లో జగన్నాథం, పాంగి రామన్న ,పాంగి బాలకృష్ణ, డి రాజు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా గురువారం విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితోనే ప్రజలను చైతన్యపరిచి, ఆదాని స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా కొత్త పోరాటం ప్రారంభిస్తామని ప్రకటించారు. విద్యుత్ అధికారులు షాపులు, గృహ వినియోగదారుల వద్ద పాత మీటర్లను తీసేసి బలవంతంగా ఆదాని మీటర్లు అమర్చుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రజల అభిప్రాయాన్ని పక్కన పెట్టి దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పార్టీ మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ మాట్లాడుతూ, అమరవీరుల తాగ్యాన్ని వృథా కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కూనవరం: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల ప్రాణత్యాగాల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదామనిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం 25 ఏళ్ల క్రితం బషీర్‌బాగ్‌లో విద్యుత్ ఉద్యమకారులపై అప్పటి టిడిపి హయాంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారన్నారు. అందరి జీవితంలో వెలుగుల కోసం ఉద్యమించి నాటి ఘటన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా విశాల ప్రపంచానికి ఉద్యమ పాఠాలు నేర్పిందన్నారు. ఇపుడు ట్రూఅప్, ఇతరత్రా సర్దుబాటు పేరుతో విద్యుత్‌ఛార్జీల భారంతో స్మార్ట్‌మీటర్ల బిగింపుతో ప్రజల నడ్డి విరగగొట్టే ప్రయత్నాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రోద్భలంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శరవేగంంగా అమలు చేయాలని చూస్తోందని, దాన్ని తిప్పికొట్టేందుకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ మోజులో పడి ప్రజలను మోసం చేసే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు. అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య,మండల కమిటీ సభ్యులు తాలూరు శ్రీనివాసరావు,శాఖ కార్యదర్శి కొండ ఈశ్వర్లు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, తలగాని నాగరాజు, నాగమణి, బాబురావు పాల్గొన్నారు.

కూనవరంలో మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

వరద గోదారి

శబరి గోదావరి సంగమం ప్రాంతంలో ఉధృతంగా ప్రవాహం

- ఉప్పొంగి ప్రవహిస్తున్న శబరి, ఇంద్రావతి
- ప్రమాదస్థాయిని మించిన కొండవాగులు
- భయం గుప్పెట్లో లోతట్టు ప్రాంత ప్రజలు
- ఒడిశా సరిహద్దులో నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి -ఎటపాక: ఎగువన పరివాహక ప్రాంతంలో ఎడతెరిపిలేని వర్షాలకు వరద ఉధృతితో గోదావరి పరవళ్ల తొక్కుతోంది. గురువారం ఉదయం 28 అడుగులుగా ఉన్న గోదావరి, వేగంగా పెరుగుతూ సాయంత్రానికి భద్రాచలం వద్ద 38.60 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకుంది. మురుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక వాగుల నుండి గోదావరి వరద పోటెత్తింది. శుక్రవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక (48 అడుగులు)చేరువకు రావచ్చని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రభావ గ్రామాల గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా గౌరీదేవిపేట పిహెచ్‌సికి తరలించినట్లు వైద్యులు దేవినాగ్ తెలిపారు. గోదావరి మళ్లీ పెరుగుతుండటం పట్ల రైతుల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు, ఒక దఫా వరద వల్ల మిర్చి నాట్లు ఆలస్యం అయ్యాయని, మళ్లీ వర్షాలు వరదలతో మరో 15 రోజులు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పొంగిన శబరి, ఇంద్రావతి నదులు

చింతూరు : గోదారమ్మ వరద తగ్గినట్టే తగ్గి, మళ్లీ ఉగ్రరూపం దాలుస్తుండడంతో పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు భీతిల్లుతున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రంలో కురిసిన అతి భారీ వర్షాలకు శబరి,గోదావరి నదులతో పాటుగా ఇంద్రావతి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని సోకిలేరు, చంద్రవంక, కుమ్మూరు, కొయ్యగోరు వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. కోయ్యగోరు వాగు పొంగటంతో ఆంధ్ర ఒడిశా రహదారి మూసుకుపోయింది. రెండు రోజుల నుండి రోడ్లపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సోకులేరు వాగు. ప్రమాద స్థాయితో ప్రవహించడంతో విఆర్.పురం, చింతూరు మండలాలకు రవాణా సంబంధాలు తెగిపోయాయి. అధికారులు నాటు పడవను ఏర్పాటు చేయడంతో చుట్టుపక్క గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి వచ్చి నిత్యవసరాలు వైద్య అవసరాలు తీర్చుకుంటు న్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్ర 38.60 అడుగులకు చేరింది. దిగువకు 7.32.176 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చింతూరు వద్ద శబరి నదినీటిమట్టం 37 అడుగుల వద్ద నిలకడగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన భారీ వర్షాలకు సుకుమా, కుంట తాలూకా కేంద్రాల్లో 30 జాతీయ రహదారి ముంపునకు గురికావడంతో వాహనాలు భారీ స్థాయిలో నిలిచిపోయాయి. రెవిన్యూ పోలీస్ శాఖలు ఇప్పటికే మైక్ ద్వారా వరద సమాచారాన్ని ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేశారు.

ముంపు మండలాల్లో భయం భయం

విఆర్ పురం: ఎగువన కురుస్తున్న వర్షాలకు వాగులు వంకల్లో వరదనీరు చేరడంతో మళ్లీ గోదావరి శబరి నదులు ఉప్పొంగాయి. శబరి గోదావరి నదుల సంగమప్రాంతం వడ్డుగూడెం గ్రామం వద్ద నీటి ఉధృతితో ప్రజలు భీతిల్లుతున్నారు. గురువారం ఉదయం నుండి నెమ్మదిగా గోదారి, శబరి నదుల్లో నీటిమట్టం పెరుగుతుండడంతో మండలంలోని రామవరం, అడివి వెంకన్నగూడెం, చింత రేగుపల్లి, కన్నాయిగూడెం, శ్రీరామగిరి, గ్రామాలు ప్రజలు ముంపు భయంతో అల్లాడుతున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితులకు జెకెసి ట్రస్ట్ భోజన సదుపాయం

చింతూరు: శబరి, గోదారి ఉధృతితో జాతీయ రహదారులపై వరద నీరు చేరి చట్టి జాతీయ రహదారి 30 వద్ద జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఎండి జమాల్‌ఖాన్ ఆధ్వర్యంలో భోజనాలను వండించి, ఆటోలో బాధిత వాహనదారులకు పంపిణీ చేశారు. అలాగే అవసరమైన వారికి ఆయుర్వేద వైద్యం అందజేశారు. కార్యక్రమంలోవ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్‌రాజు, సభ్యులు అబ్రార్ ఖాన్, రియాజ్, అజీజ్, ఎస్కే సమీర్, యాకుబ్ పాషాపాల్గొన్నారు.

సోకులేరు వద్ద పడవ ఎక్కుతున్న ప్రజలు

చింతూరు మండలంలో రహదారిపైకి వచ్చిన వరద

హుకుంపేటలో మునిగిన వరి పంట

మన్యంలో భారీ వర్షం

-మునిగిన పొలాలు,
-కూలిన గృహాలు
-అస్తవ్యస్తంగా రోడ్లు

జి.మాడుగులో పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

ప్రజాశక్తి–జి.మాడుగుల: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నుర్మతి పంచాయతీ పినగరువు గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో కొండ గెడ్డ పొంగిపారుతుంది. దీంతో గిరిజనులు గ్రామాన్ని చేరుకోవాలంటే గెడ్డ దాటాల్సిన పరిస్థితి నెలకొంది. తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సాహసం చేయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ముంచింగిపుట్టు :: మండల వ్యాప్తంగా గత వారం రోజులుగా భారీ వర్షాలు కురవడంతో లక్ష్మీపురంలో పాంగి ముత్తాయి అనే మహిళ గృహం కూలి నేల పట్టం అయ్యింది. గురువారం సిపిఎం మండల కార్యదర్శి, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ గత వారం రోజులుగా బారి వర్షం కురవడంతో ఇల్లు కూలి పోయిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యేక నిధులు కేటాయించి గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో వంతల కమలమ్మ గృహం సైతం కూలిపోయిందని పేర్కొన్నారు. మండలం వ్యాప్తంగా అనేక చోట్ల గృలు కూలి పోయాయని,వారిని గుర్తించి కొత్త ఇల్లు మంజూరు చేసి నిర్మాణం చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు టి.గోపాల్, టి.గణపతి, పురుసుత్తి, మహదేవ్ పాల్గొన్నారు.

హుకుంపేట: గత వారం రోజులుగా మండలాన్ని ముంచెత్తిన భారీ వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రంగశీల పంచాయతీ పరిధిలోని బలోర్ధ, ఇరుకువలస, టి.టింగ్ వలస, జామి గూడ, మసాడా తదితర గ్రామాల పంట పొలాలు ఏరులై ప్రవహిస్తూ వర్షపు నీటితో నిండిపోయాయి. ఇటీవలే రైతులు నాటిన వరి నాట్లు వర్షపు ఉధృత ప్రవాహానికి నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంటలు పాడైపోతాయనే భయాందోళన రైతుల్లో మొదలైంది. అప్పులు చేసి వేసిన పంట ఇప్పుడు నీట మునిగితే తమకేం మిగిలిపోతుందని ప్రశ్నిస్తున్నారు. పొలాల్లో నిల్వ నీటిని తొలగించే చర్యలు గ్రామస్థులు చేపట్టారు. గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి.

ముంచంగిపుట్టులో కూలిన ఇల్లు

'ఆది కర్మయోగి'ని వక్రీకరించొద్దు

- మారేడుమిల్లి ఎంపిడిఒపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలి
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత లోతా రామారావు

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి నిర్దేశించిన ఆది కర్మయోగి అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఐటిడిఎ పిఒ వక్రీకరించడం తగదనిఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా. రామారావు ఆరోపించారు. గురువారం రంపచోడవరంలో మీడియాతో మాట్లాడుతూ రంపచోడవరంలో ఆది కర్మయోగి కార్యక్రమ విషయం లో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వ్యవహ రిస్తున్న తీరుఅనేక విమర్శలకు తావిస్తుం దని, తన స్థాయికి తగ్గట్టుగా పిఒ వ్యవహరించడం లేదని ఆరోపించారు. తప్పు చేస్తున్న అధికారులను మందలించాల్సిన ఐటిడిఎ అధికారి, వారి తప్పులను కప్పిపుచ్చుతూ ప్రోత్సహించేలా వ్యవహరించడం, తన స్థాయి మర్చిపోయి విరుద్ధమైన పత్రిక ప్రకటన చేయడం సరికాదని, ఇప్పటికైనా తన పద్ధతిని మార్చుకోవాలని హితవు పలికారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వ్యవహార శైలిపై ఆదివాసి సంఘాలు, ఆదివాసి ప్రజలు విమర్శలు చేస్తుంటే వాటిని సరి చేసుకోకుండా బెదిరింపు ధోరణితో వ్యవహరించం దుర్మార్గమన్నారు. 22న జరిగిన ఘటనలో మారేడుమిల్లి ఎంపిడిఒపై కంటి తుడుపు చర్యగా విచారణకు ఆదేశించారే తప్ప తగు చర్యలు తీసుకునేలా లేదని, వెంటనే మారేడుమిల్లి ఎంపిడిఒను సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించాలన్నారు బొర్నగూడెం క్వారీ విషయంలో విచారణ చేసి ఏం చర్యలు తీసుకున్నారని, నరసాపురం మెటల్ క్వారీ విషయంలో స్థానిక ఆదివాసులు ఆందోళన చేస్తుంటే విచారణకు ఆదేశించారని, ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, కోన గణేష్, చదల అశోక్, మల్లేష్ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE CUM (FAMILY COURT) MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT SRIKAKULAM
M.V.O.P. 15&/2024

Between:-
Mailapalli Chinna @ Asirithatha. ---Petitioner.
And:-
Koyyana Chandra Rao & 2 Others
----Respondents.

To,
R-2: NICE Foundation, represented by Dr.M. Padmanabh Reddy, Door No.3-221, near Madhamambha Temple, Chinthapalli Road, Paderu. Paderu District, Pin-531 024,
Owner of crime vehicle i.e., Ambulance Van No. AP-31TC-6776.

NOTICE

Please take this notice in the above matter, that the above matter is posted to 01-09-2025 for your appearance. You are here by directed to appear before the above court **at 10.30 A.M On 01-09-2025** in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence.

// By Court Order //

B. SRINIVASA REDDY
ADVOCATE,
SRIKAKULAM, CELL: 98660 81213.

వంతెనల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు : మండలంలోని అత్యంత మారుమూల లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో గల కర్ల పొదోర్ తుమిడిపుట్టు, మెట్టగూడ గెడ్డలో పీఎం జన్ మన్ పథకంలో నిధులు మంజూరు చేసి బ్రిడ్జీల నిర్మాణాలు చేపట్టాలని గురువారం స్థానిక సర్పంచ్, సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షం కారణంగా వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. ఆ ప్రాంతాల ప్రజలు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. డిఆర్ డిపోకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గత ఏడాది లో మరణించిన వ్యక్తి మృతదేహాన్ని కావలా శాకీ గెడ్డ ఉధృతి తగ్గిన అనంతరం మూడో రోజు దహనసంస్కరణ చేసామని గుర్తు చేశారు.ప్రజా ప్రతినిధులకు అనేక మార్లు వినతి పత్రం అందజేయడం జరిగిందని, దీంతో తో పీఎం జన్ మన్ ద్వారా బ్రిడ్జి మంజూరు అయిందని చెప్పడమే తప్ప ఏ విధమైన కార్యాచరణ లేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పీఎం జన్మన్ పథకంలో బ్రిడ్జిల నిర్మాణాలు కొరకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ నిర్మాణ పనులు ప్రారంభం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుమిడిపుట్టు, కర్లపొదోర్, మెట్టగూడ, ఉప్పలగుల, లక్ష్మీపురం గెడ్డలో పీఎం జన్ మన్ ద్వారా నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిసా సభ్యులు బి.విక్రమ్, జి.ఆనంద్, పంతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ఎన్నికైన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-చింతపల్లి:అంగన్వాడి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. అధ్యక్షురాలిగా కంకిపాటి రాములమ్మ, ప్రధాన కార్యదర్శిగా గెమ్మిలి ఇందుమతి, కోశాధికారిగా సత్యవతి బాధ్యతలు స్వీకరించారు. ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, 23 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అందరినీ ఒకే వేదికపైకి తెచ్చి ఉద్యమం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. గౌరవాధ్యక్షురాలిగా పెంటమ్మ, సలహాదారులుగా బోనంగి చిన్నయ్య, పడాల్ కొనసాగనున్నారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను అరకు సిఐ హిమగిరి గురువారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజా మన్ననలు పొందాలన్నారు. మండలంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నవరాత్రులు ముగింపు అనంతరం నిమజ్జన కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పిలుపు చవితి విగ్రహాల ఏర్పాటు, నిర్వాహకులు ఎటువంటి అల్లర్లు లేకుండా చూడాలని సూచనలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి పాపినాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సిఐ

శిథిలావస్థలో బాలుర పాఠశాల వసతి గృహం

- మరమ్మతుకు నోచని కిటికీలు, తలుపులు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి:శిథిలావస్థలో బాలుర పాఠశాల వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ గడపవలసిన పరిస్థితి ఏర్పడింది. కిటికీలు, తలుపులు పైకప్పు శ్లాబ్ పెచ్చులు కారణంగా విరిగి పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు పథకంలో మంజూరైన నిధులతో గోడలపై రంగులే తప్ప ఎక్కడా మరమ్మత్తు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ హాస్టల్ భవన వసతి గృహం 40 నుండి 45 ఏళ్ల పైగా కావస్తుండడంతో భవనపు పలు భాగాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఈ పాఠశాలల చదివే 400 మంది పైగా విద్యార్థులు నిద్రిస్తున్న సమయంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుఫాను కారణంగా ఏకధాటి గా కురుస్తున్న భారీ వర్షాలకు భవనమంతా తడిసి లోపల గదులంతా నీరు కారుతూ ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో విద్యార్థులు గడపవలసిన దుస్థితి నెలకొంది. పాతైన 20 గదులతో కూడిన ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి కొత్త హాస్టల్ భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన హాస్టల్ వసతి భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

శిథిలమైన కిటికీ తలుపు పై భాగాలు

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ నవ భరత్

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని సమగిరి గ్రామంలో గిరిజనేతరుడు నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొంది, ప్రభుత్వాలు పొందుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ రీమల నవభరత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నకిలీ ఎస్టీ కుల ఆధార ధ్రువపత్రాలు ఇవ్వడం నేరమన్నారు. గొందిపాకల పంచాయతీ పరిధిలోని సమగిరి గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనేతరుడు స్థానికులతో స్నేహం పెంచుకొని ఎస్టీ వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రం పొంది, విద్యాభ్యాసం కొనసాగిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అన్యాయంగా పొందుతున్నారని ఆరోపించారు. అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, సస్పెండ్ చేసి, శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నిజమైన గిరిజనులు మాత్రం తమ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సమయానికి అందక, విద్యా అవకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా ఎస్టీ వాల్మీకి ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, శిక్ష విధించాలన్నారు.

బురదలో కూరుకుపోయిన బస్సు

రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు: మరమ్మత్తులకు గురై నిలిచిపోయిన బస్సును తప్పించబోయి మరొక బస్సు బురదలో కూరుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. పాడేరు డిపోకు చెందిన పాడేరు,డొంకరాయి బస్ సర్వీస్ డొంకరాయిలో బయలుదేరి వస్తుండగా వలసగెడ్డ సమీపంలో సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయింది. భద్రాచలం కాంప్లెక్స్ నుంచి బయలుదేరి చింతూరు మోతుగూడెం పొల్లూరు డొంకరాయి మీదుగా విశాఖపట్నం వెళుతున్న విశాఖపట్నం డిపోకు చెందిన బస్ సర్వీస్, రోడ్డు పక్కన ఆగిన బస్సును తప్పించిపోయి బురదలో కూరుకుపోయింది. దీంతో రహదారికి ఇరువైపులా రాకపోకలు సుమారు గంటన్నర పాటు నిలిచిపోయాయి. సమీప గ్రామస్తులు ప్రయాణికులు శ్రమించి బురదలో కూరుకుపోయిన బస్ సర్వీసును బయటికి తీశారు.

ఆగిపోయిన ఆర్‌టిసి బస్సులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల కేసు వాయిదా

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కులో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు వేసిన కేసుకు సంబంధించి అక్టోబరు 24కు హైదరాబాద్‌లోని ట్రిబ్యునర్ కోర్టు వాయిదా వేసింది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై విశాఖలోని రీజనల్ లేబర్ కమిషనర్ సెంట్రల్‌లో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు కేసు వేశాయి. పలు వాయిదాలు తర్వాత కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించకూడదని ఆర్‌ఎల్‌సి చెప్పినా యాజమాన్యం వినలేదు. దీంతో కేసును హైదరాబాద్‌లో ఉన్న ట్రిబ్యునల్ కోర్టుకు ఆర్‌ఎల్‌సి రిఫర్ చేశారు. ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు గురువారం కార్మికుల నుంచి సిఐటియు నాయకులు నమ్మి రమణ, వివి.రమణ, యాజమాన్యం నుంచి డిజిఎం హెచ్‌ఆర్ సుబేంద్ కర్, కాంట్రాక్టర్ల అసోసియేషన్ నుంచి పి.అప్పలనాయుడు, తిప్పల చక్రధర్‌రెడ్డి, మణి, అప్పారావు హాజరయ్యారు. ఈ కేసును అక్టోబరు 24వ తేదీకి వాయిదా వేశారు.

నేరాలు ఘోరాలు

31 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :: ఏఓబి సరిహద్దు ప్రాంతం నుండి అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో స్థానిక ఎస్సై జే రామకృష్ణ సిబ్బందితో మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ ెజబంగి జంక్షన్ వద్ద మాటు వేసి వాహనాలను తనిఖీ చేశారు. మారుతి సుజుకి డిజైర్ కారులో నలుగురు 31 కిలోల గంజాయి తరలిస్తూ గురువారం పట్టుబడ్డారని తెలిపారు. వీరిలో పనస గణేష్, తాంగుల బుద్దు, కోర్ర నందా కుమార్, దెబ్బ కిముడులపై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్ కు తరలించారు. ఒకరు పరారయ్యారని స్థానిక ఎస్సై జె రామకృష్ణ తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ లక్ష్మణరావు, హెూమ్ గార్డ్ మత్స్య లింగం, పంచాయతీ విఆర్ఓ పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీకి గీతం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థికి 'ఇండియన్ ఆర్మీ'లో పనిచేసే అరుదైన అవకాశం లభించింది. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ద్వారా బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్స్ అప్లికేషన్స్ (బిసిఎ) విద్యను పూర్తిచేసుకున్న వినీల్ దీక్షిత్ ఈ ఘనతను సాధించాడు. విశ్వవిద్యాలయంలోని ఎన్‌సిసి నేవీ విభాగంలో కేడెట్‌గా ఎంపికైన వినీల్ దీక్షిత్ క్రమశిక్షణ, అంకితభావం, కఠిన పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యం గల ఉత్తమ కేడెట్‌గా జాతీయ స్థాయిలో రిపబ్లిక్ డే పెరేడ్‌కు గతంలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాడు. గీతం విద్యార్థి ప్రతిభను గుర్తిస్తూ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బి) ఈ ఏడాది ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ కింద ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమిలో శిక్షణకు ఎంపిక చేసింది. శిక్షణ అనంతరం భారత రక్షణ దళాలలో ఆఫీసర్ కేడర్‌లో పనిచేసే అవకాశం వినీల్ దీక్షత్‌కు లభించనుంది. కాగా వినీల్ దీక్షిత్ ప్రతిభను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్‌సిసి అధికారులు అభినందించారు.

నేడు 'ఫిన్‌టెక్ ఒలింపియాడ్'

ప్రజాశక్తి-మధురవాడ : ఫిన్‌టెక్ రంగంలో యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 29వ తేదీన రాష్ట్రస్థాయి ఫిన్‌టెక్ ఒలింపియాడ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ సిఇఒ నిపాదత్తా తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచ్యువల్ ఫండ్స్ ఇండియా (ఎఎమ్‌ఎఫ్‌ఐ), జిరోదా, క్యాష్‌రిచ్, యుటిఐ మ్యూచ్యువల్ ఫండ్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఒలింపియాడ్‌లో భాగంగా దేశ ఆర్థికరంగంపైన, ఆర్థిక అక్షరాశ్యతపైన, పెట్టుబడులకు, సంబంధించిన ఆర్థిక అంశాలపైన నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంధ్రప్రదేశ్‌లోని వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఒలింపియాడ్‌లో పాల్గొనున్నారని వెల్లడించారు. ఫిన్‌టెక్ పరిజ్ఞానంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు సర్టిఫికేట్‌లు, నగదు బహుమతి అందజేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ముగ్గురు విజేతలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ఫిన్‌టెక్ ఒలింపియాడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.

2 నుంచి అప్పన్న వార్షిక పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి ఉత్సవమూర్తులైన శ్రీ గోవింద రాజ స్వామి, అమ్మవార్లను కల్యాణ మండపం వద్ద వేంచేయించి ఉత్సవం జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ పవిత్రోత్సవాల్లో హోమాలు, వేదపారాయణం, దివ్య ప్రబంధ సేవకాలము, తిరువీధి నిర్వహించనున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. గురువారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో పలు ఇంజనీరింగ్ విభాగాల ఇఇలు, డిఇఇలు, ఎఇఇలతో పనుల పురోగతిపై సమీక్షించారు..ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో అర్హులకు గృహాలు, అంగన్వాడీలకు తాగునీటి పథకాలు, స్పెషల్ మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల ద్వారా మంజూరైన పనులు, వాటి పురోగతిపై సమీక్షించారు. నిరుపేదలకు మంజూరైన ఇళ్ల, వాటిల్లో ఎన్నెన్ని ఏయే దశల్లో నిర్మాణంలో ఉన్నవీ, పూర్తయినవి, ఇంకా పూర్తిచేయాల్సిన ఇళ్ల నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏజెన్సీలో గ్రామీణ త్రాగునీరు ఇంజనీర్ విభాగం ద్వారా అంగన్వాడి కేంద్రాలకు మంజూరైన తాగునీటి పథకాలు, వాటి పురోగతిపై ప్రశ్నించారు.. స్పెషల్ మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల ద్వారా ఎన్ని పనులు మంజూరయ్యాయి, వాటిలో పూర్తి చేయాల్సినవెన్ని, మిగతా పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో ప్రశ్నించారు ఏజెన్సీలో అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో మంజూరైన పనులను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం, సమన్వయంతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఇఇలు రవికుమార్, సుబ్బయ్య, డి ఈ లు రామచంద్ర మూర్తి, భవాని,సుబ్బారావు, శ్రీనివాసరావు, ఎఇఇలు, జెఇలు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో వివక్ష

ప్రజాశక్తి - రంపచోడవరం : వాల్మీకులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారుల జాప్యం వల్ల విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఉందని వాల్మీకి సంఘ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రయివేటు రిసార్ట్‌లో విలేకర్లతో అల్లూరు జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్ల చిన్న నారాయణరావు మాట్లాడుతూ, జిఒ 58 ప్రకారం వాల్మీకుల కులధ్రువీకరణపై డిస్టిక్ లెవెల్ స్క్రూటీని కమిటీ 45 రోజుల్లో విచారణ పూర్తి చేయాల్సి ఉండగా, 20 ఏళ్లుగా నేటికీ పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో అర్హులైన విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు వాస సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - రాజవొమ్మంగి :విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్‌ఎఫ్) తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రంపచోడవరం డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 29న శుక్రవారం రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని రాజవొమ్మంగి విద్యుత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు స్థానిక విద్యుత్ అధికారులు తలెఇఆపరు..విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే సదస్సు వచ్చి చైర్ పర్సన్ డాక్టర్.బి.సత్యనారాయణ ఆధ్వర్యంలోని సిజిఆర్ఎస్ కమిటీ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చుని, ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంటలకు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి -సీలేరు: తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు చింతపల్లి జికె.వీధి మండలాల్లో ముంపునకు గురై నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి తక్షణమే ఆదుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ నాటిన వరి పొలాల్లో వర్షపు నీరు నిండుగా చేరి ఆదిలోనే రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. గత ప్రభుత్వాలు గిరి రైతులకు పంటనష్టాలిచ్చి ఆదుకుంటామని హామీలిచ్చి అరకొర సాయంతో చేతులు దులుపుకున్నాయన్నారు. ప్రభుత్వం అధికారులు ముంపు మండలాల్లో పర్యటించి రైతులుకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వారికి ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి- వై.రామవరం : మండలంలోని అభివృద్ధి పనులపై గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, రంపచోడవరం పిహెచ్ఒ దయానంద సమీక్షించారు. వై రామవరం లోయర్ పార్ట్‌లోని 11 సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సమావేశం నిర్వహించి, మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. జిఎస్‌డబ్ల్యూఎస్ సర్వీసులు, సర్వేలపై సచివాలయాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు కార్యక్రమంలో, ఎంపిడిఒ బాపన్న దొర, ఎంపిపి ఆనంద్, పలు అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఆసుపత్రుల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని, అలాగే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు ఆదేశించారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం చింతూరు వెళ్తూ మార్గమధ్యంలో రాజవొమ్మంగి, లాగ రాయి, జడ్డంగి పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిల పరిసరాలను పరిశీలించారు. వార్డులు, మందులు ఇచ్చే గదులు, ల్యాబ్ గదులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఏ విధంగా అందుతున్నది అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సిబ్బంది ప్రేమతో మెలగాలని, రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో మందులు వివరాలు, రిజిస్టర్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు .

రాజవమ్మంగి 108 మరమ్మత్తులకు గురైన నేపథ్యంలో అంబులెన్స్,అలాగే ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పలువురు అల్లూరి జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వరనాయుడు దృష్టికి తీసుకువెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.అలాగే రాజవొమ్మంగి సిహెచ్‌సిని రంపచోడవరం నియోజకవర్గంలో పలు పిహెచ్‌సిల స్థాయిని పెంచి రోగుల సౌకర్యార్థం సిహెచ్‌సిలుగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెల 25న జరిగిన జిల్లా అభివృద్ధి సలహామండలి సమావేశంలో రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి లాగారాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో సుమారు 3 నెలలు నుండి జ్వరాలు, ఒళ్లు, కాళ్లనొప్పులు, వాపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనిఅరకు ఎంపీ తనూజ రాణీ ద్వారా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వర నాయుడు లాగరాయి ఆసుపత్రిలో వైద్యులకు పలు సూచనలు చేశారు.అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిహెచ్‌సిలలో ఏమైనా సమస్యలు నెలకొంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట ఎంపిపి గోము వెంకటలక్ష్మి, రాజవొమ్మంగి, లాగరాయి,జడ్డంగి పీహెచ్సీ వైద్యాధికారులు సుష్మ, సతీష్,,శరత్ చంద్ర, పావని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

శతశాతం విద్యార్థుల హాజరుపై దృష్టి

ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - గంగవరం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను, ఏజెన్సీ డిఇఒ వై మల్లేశ్వరరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. 461 మంది గాను 407 మంది విద్యార్థులు మాత్రమే హాజరు కావడంపై స్పందిస్తూ, నూరు శాతం హాజరు ఉండేటట్లుగా చూడాలని హెచ్ఎంను ఆదేశించారు. విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు తప్పనిసరిగా లీవ్, లేదంటే హాజరు అయ్యారని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్ పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలని, తద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థుల నోట్, వర్క్ బుక్స్ పరిశీలించారు. బేస్ లైన్ గ్రేడింగ్స్‌ను పరిశీలించి, 'డీ' గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు 45 రోజులు పాటు యాక్షన్ ప్లాన్ తయారు చేసి, 'ఏ'గ్రేడ్‌లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యా మిత్ర కిట్స్ అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. టీచర్స్ హ్యాండ్ బుక్స్ ప్రతి ఒక్కరి దగ్గర ఉండాలని, అకడమిక్ క్యాలెండరు ప్రకారం టిఎల్ఎం ఉపయోగించి విద్యార్థులకు బోధన జరగాలని, ప్రాజెక్ట్ వర్క్స్ , ఇన్నోవేటివ్ యాక్టివిటీస్ విద్యార్థులతో చేయించాలని, ప్రతినెలా విద్యార్థులకు విదిగా ఆరోగ్య తనిఖీలు చేయించాలన్నారుకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ మల్లేశ్వరరావు

31 వరకూ పంటల బీమాకు అవకాశం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద 2025 ఖరీఫ్ సీజన్‌కు ధాన్యం రైతులు పంటల బీమా గడువును ఈనెల 31వరకు పొడిగించారని స్థానిక వ్యవసాయ చక్రధర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎకరానికి రూ 647 ప్రీమియం చెల్లించి స్టేట్ బ్యాంక్ జనరల్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్‌కు ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. బ్యాంక్‌లో గానీ, సిఎస్‌సి సెంటర్ ద్వారా గానీ, పోస్టాఫీస్, జాతీయ పంట బీమా పోర్టల్‌లోగానీ ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవచ్చని సూచించారు. పంటల బీమా చేయించేందుకు రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, కౌలు కార్డ్, బ్యాంక్ పాసుబుక్, ఏరియా సౌన్ సర్టిఫికెట్, ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

ఎరువుల కొరతపై ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల సరఫరాకు చర్యలు చేపట్టాలని ఎంపిపి బంధం శ్రీదేవి కోరారు. గురువారం మండలంలో ఎరువుల కొరతపై మండల వ్యవసాయ శాఖాధికారులు, పిఎసిఎస్ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, పిఎసిఎస్‌ల ఎరువుల లైసెన్సు కాలపరిమితి ముగిసినందున వాటి ద్వారా ఇప్పటికిప్పుడు ఎరువులు సరఫరా చేయడం సాధ్యమయ్యే పనికాదన్నారు. ప్రయివేటు దుకాణదారులు ఎరువులు బుక్ చేయట్లేదని, వారు ఎరువుల అమ్మకానికి సుముఖత చూపట్లేదన్నారు. అలాంటి పక్షంలో ప్రయివేటు దుకాణదారుల లైసెన్సులను ఎందుకు రద్దుచేయకూడదని ఎంపిపి ప్రశ్నించారు. ఎరువులు అమ్మకానికి ముందుకు రాని వ్యాపారులకు నోటీసులిచ్చి వారి లైసెన్సులను రద్దు చేయమని ఆదేశించారు. స్థానికంగా ఎరువులు లభ్యం కాని పరిస్థితుల్లో పక్కన ఉన్న గోకవరం, కొత్తపల్లి, జగ్గంపేట వెళ్తే అక్కడివారు ఎరువులు ఇవ్వడం లేదన్నారు. దీనిపై వెంటనే జిల్లా వ్యవసాయ శాఖాధికారితో ఫోనులో మాట్లాడారు. నాలుగు రోజుల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, దీనిపై సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా గ్రామాల్లోని రైతులకు తెలియపరచాలని సూచించారు. అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో ఎరువులు కొని మోసపోకుండా చూడాలని సూచించారు.

ఆర్‌టిఐ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- వై.రామవరం : సమాచార హక్కు చట్టం కింద మండలం కేంద్రంలోనూ, మండల పరిధిలో అక్రమ కట్టడాల జాబితా ఇవ్వాలని అడిగితే స్పందించిన తహశీల్దార్‌తోపాటు ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారు ఆదివాసి సంక్రమ పరిషత్ ప్రధాన కార్యదర్శి కుంజం శీను డిమాండ్ చేశారు. మండల పరిధిలో గుర్తించిన అక్రమ కట్టడాల జాబితా ఇవ్వాలని సమాచార హక్కుల చట్టం కింద 2005 ప్రకారం, వై రామవరం తహశీల్దార్ కార్యాలయంలో, జులై 22న దరఖాస్తు చేశారని, నెల రోజులు దాటినా తమకు సమాచారం అందలేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్లను కోరారు. చట్టాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ప్రకృతి విధానంలో సాగుపై శిక్షణ

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలని తద్వారా పెట్టుబడి భారం తగ్గి, ఆరోగ్యవంతమైన దిగుబడి సాధించవచ్చుని, పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని వ్యవసాయంధికారి ఐ. భాను ప్రియాంక సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ పి. సింహాచలం, ప్రకతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, వరలక్ష్మి, ఆత్మ బిటిఎం మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సత్కారం

ప్రజాశక్తి-కొయ్యూరు : విజయనగరం రీజనల్ ఆఫీస్‌కు కొయ్యూరులోని ఎపి గామీణ బ్యాంక్ మేనేజర్ జి సతీష్‌కుమార్ బదిలీ అయ్యారు.. నూతన బ్యాంకు మేనేజర్‌గా జి సతీష్, ఫీల్డ్ ఆఫీసర్‌గా సిహెచ్ భానుప్రకాష్ విధుల్లో చేరారు. బదిలీ అయిన మేనేజర్ సతీష్‌కుమార్‌ను సహచర బ్యాంక్ ఉద్యోగులతోపాటు వెలుగు సిబ్బంది ఘనంగా సన్మానించారు.. కార్యక్రమంలో బ్యాంక్ క్యాషియర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.